సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024



హాస్టల్ మెస్ తనిఖీ

విశాఖ: ఏయూ న్యాయ విద్యార్థుల హాస్టల్‌ను రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ గురువారం తనిఖీ చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చనను నిర్వహించారు.



తొలి పొద్దుపొడుపులో..

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌లో గురువారం సూర్యోదయం సమయంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

ప్రత్యక్ష నారాయణుడికి వందనం



రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయం రథసప్తమి పర్వదినానికి సిద్ధమైంది. మరో అరసవల్లిగా భక్తులు భావించే ఈ దేవాలయాన్ని శుక్రవారం వేలాదిమంది భక్తులు దర్శించుకోనున్నారు. వేడుకలకు ఆలయ పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు.

- మరో అరసవల్లి రాజుపాలెం

8లో

సూక్ష్మలిపిలో సూర్యాష్టకం



చిన్నసైజులో రవికుమార్ రాసిన సూర్యాష్టకం, తదితర పుస్తకాలు

మాకవరపాలెం: రథసప్తమిని పురస్కరించుకుని మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ సూర్యష్టకం, సూర్య ప్రార్థన, సూర్య అష్టోత్తర శతనామావళి, ఆదిత్య హృదయం, ఆదిత్య అష్టోత్తర శతనామావళిలను సూక్ష్మలిపిలో రాశారు. శుక్రవారం సూర్యజయంతి సందర్భంగా వీటిని రాసినట్టు తెలిపారు. 2 సెంటీమీటర్ల సైజులో సూర్యప్రార్థనను 9 పేజీలు, సూర్య అష్టోత్తర శతనామావళి పది పేజీలు, ఆదిత్య హృదయం 11 పేజీలు, ఆదిత్య అష్టోత్తర శతనామావళిని 12 పేజీల్లోనూ రవికుమార్ సూక్ష్మలిపిలో రాశారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.కాళిదాస్‌రెడ్డి (విశాఖ), రాష్ట్ర అధికార ప్రతినిధిగా పాకా సత్యనారాయణ (విశాఖ), సెక్రెటరీలుగా జి.రోశిరెడ్డి (విశాఖ), మొస్య బుజ్జిబాబు (అల్లూరి), వి.శ్రీనివాసరావు (విశాఖ), యర్రా శ్రీనివాసరావు (అనకాపల్లి), జాయింట్ సెక్రెటరీలుగా గండేపల్లి త్రినాథ్‌మూర్తి (విశాఖ), గాలి రామిరెడ్డి (విశాఖ), పంపన సత్యబాబు (అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం ప్రెసిడెంట్‌గా మత్స్యరాస వెంకటలక్ష్మి (అల్లూరి), జోనల్ ఇన్‌చార్జి కిముడు శ్రీనివాస విశ్వప్రసాద్ నాయుడు (అల్లూరి), సెక్రెటరీలుగా ఎస్.ఆనందబాబు (విశాఖ), గోవర్థన్ గిరి (అనకాపల్లి), అసిర గోవింద్ (అనకాపల్లి), పండా రామకృష్ణ దొర (అల్లూరి), కిముడు త్రిమూర్తుల దొర (అనకాపల్లి), గబ్బాడి సన్యాసిదొర (అల్లూరి), వంతల బాబూరావు (అల్లూరి), జాయింట్ సెక్రెటరీలుగా జన్ని నరసింహమూర్తి (అల్లూరి), కిముడు శివ లక్ష్మి (అనకాపల్లి), మజ్జి జయవర్ధిని (అల్లూరి) లను, కురుడుబోయిన గంగరాజు (అల్లూరి), కూడా సురేష్‌కుమార్ (అల్లూరి), కిల్లు కోటిబాబు (అల్లూరి)లను నియమించారు. రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీలుగా గవర నాయుడు (విశాఖ), కుడినోయిన గంగరాజు (అల్లూరి), రాష్ట్ర సాంస్కృతిక విభాగ కమిటీ సెక్రెటరీలుగా బొండాడ వెంకట రమణ (విశాఖ), శోభ ధర్మయ్యదొర (అల్లూరి), సంపంగి శ్రీనివాసరావు (విశాఖ), జాయింట్ సెక్రెటరీగా కొండపు జగదీశ్వరరావు(విశాఖ)లు నియమితులయ్యారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం



లక్కబొమ్మల తయారీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

కోటవురట్ల: ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి గురువారం గొల్లపేటలో లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఏటికొప్పాక మాదిరిగా కోటవురట్ల కూడా లక్కబొమ్మల తయారీకి కేంద్రం కావాలన్నారు. ఏపీహెచ్‌డీసీ, డీసీహెచ్ సంయుక్తంగా రూ.7.45 లక్షల వ్యయంతో 30 మంది కళాకారులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

కాపీ నేతకు ఝలక్

పాదయాత్ర చేస్తే ఎమ్మెల్యే కావచ్చని ఆయన పగటి కలలు కంటున్నారు.. వారం రోజులుగా నియోజకవర్గంలో నడక సాగిస్తున్నారు.. వెంట కనీసం 20 మంది కూడా లేకపోవడంతో అభాసుపాలయ్యారు.. మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడి దుస్థితి ఇది. 2019 ఎన్నికలకు ముందు బూడి ముత్యాలనాయుడు చేసిన పాదయాత్ర తరహాలో ప్రజలకు దగ్గర కావాలని ఆయన చేసిన ప్రయత్నం విఫలం కావడం పార్టీకి మరింత మైనస్ అవుతుందని భావిస్తున్నారు.



నాడు: బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లిలో చేపట్టిన పాదయాత్రలో జనసందోహం (ఫైల్)



నేడు: గవిరెడ్డి పాదయాత్రలో పది మంది కూడా లేని వైనం

- గవిరెడ్డి పాదయాత్రను పట్టించుకోని మాడుగుల ప్రజలు
- బూడి తరహాలో దగ్గరవుదామన్న ఆశలకు గండి
- వారం రోజులుగా పర్యటిస్తున్నా వెంట 20 మంది కూడా లేని దుస్థితి
- 2019లో బూడి పాదయాత్రకు బ్రహ్మరథం పట్టి రెండోసారి గెలిపించిన ప్రజలు
- గవిరెడ్డి మండలాల్లో తిరుగుతున్నప్పటికీ స్పందన కరువు
- పాదయాత్రకు పార్టీ నేతలు, కార్యకర్తలే దూరం

సాక్షి, అనకాపల్లి: పులిని చూసి నక్క వాత పెట్టుకుంటే జనం నమ్ముతారా? ఎవరు ప్రజా నాయకులో.. ఎవరు అభివృద్ధి కారకులో వారికి ఆమాత్రం తెలీదా? అందుకే గవిరెడ్డి మాస్టర్ ప్లాన్ బెడిసికొట్టింది. పాదయాత్ర చేస్తే ఎమ్మెల్యే కావచ్చని ఆయన పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. నాడు బూడికి బ్రహ్మరథం పట్టిన మాడుగుల ప్రజలు నేడు గవిరెడ్డి యాత్ర వైపు కన్నెత్తి చూడడం లేదు కదా పట్టుమని 20 మంది కూడా యాత్రలో లేరు. సొంత పార్టీ తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు సైతం ఆయన పాదయాత్రకు దూరంగా ఉంటున్నారు. దీంతో పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. గతంలో తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ఆ తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది.

అప్పుడు టీడీపీ మోసపూరిత హామీలను నిలదీస్తూ బూడి ముత్యాలనాయుడు చేపట్టిన పాదయాత్రకు వేలాది మంది ప్రజలు అడుగులో అడుగు వేసి నడిచారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలే కాక మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసింది. మాడుగుల నియోజకవర్గ ప్రజలంతా సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారు. అప్పటి మోసపూరిత పాలనను, ఇప్పటి సంక్షేమ పాలనను బేరీజు వేసుకున్న ప్రజలు గవిరెడ్డి పాదయాత్రను పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

మాడుగుల నియోజకవర్గ ప్రజలు ఆదరణ చూపించిన వారిని అక్కున చేర్చుకుంటారు. అదేవిధంగా హామీలిచ్చి మోసం చేసిన పార్టీలను భూస్థాపితం కూడా చేస్తారు. అందులో భాగంగానే నాడు 2014–19 టీడీపీ మోసపు పాలనను తిరస్కరించారు. చంద్రబాబు రైతు రుణమాఫీ, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణ మాఫీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి 600కు పైగా అబద్ధపు హామీలు ఇచ్చి అమలు చేసిన పాపాన పోలేదు. వాటిని నిలదీస్తూ అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు అనుబంధంగా మాడుగుల ఎమ్మెల్యేగా బూడి ముత్యాలనాయుడు నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్రకు ప్రజల్లో స్పందన వచ్చింది. వేలాది మంది ప్రజలు పాదయాత్రలో పాల్గొన్నారు. మహానేత వైఎస్సార్ హయాంలో అందించిన సంక్షేమపాలన, జరిగిన మేలును గుర్తుంచుకుని ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్‌ను రెండు పర్యాయాలు గెలిపించారు. బూడి ముత్యాలనాయుడిని రెండుమార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహానేత వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సువర్ణపాలనలో ప్రజలంతా లబ్ధి పొందారు. సంతోషంగా ఉన్నారు. ఇప్పుడు ఇదే మాడుగుల నియోజకవర్గంలో మూడోసారి బూడి ముత్యాలనాయుడిని గెలిపించి హ్యాట్రిక్ విజయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- తారువ సమీపంలో బాహాబాహికి దిగిన గవిరెడ్డి, పీవీజీ వర్గీయులు
- మారేపల్లిలోని మాజీ సర్పంచ్ ఇంటికి గవిరెడ్డి వెళ్లడంతో నెలకొన్న వివాదం
- తమను ఇబ్బందులకు గురిచేసిన వారి ఇంటికి ఎలా వెళ్తారని నిలదీత



టీడీపీ పాదయాత్రలో గవిరెడ్డి రామానాయుడు సమక్షంలో కుమ్ములాటకు దిగిన తమ్ముళ్లు

సాక్షి,అనకాపల్లి/ దేవరాపల్లి: తెలుగుదేశం పార్టీ చేపట్టిన పాదయాత్రలో తమ్ముళ్లు నడిరోడ్డుపై కుమ్ములాటకు దిగారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ చేపట్టిన పాదయాత్ర కాస్తా కార్యకర్తలు, నాయకుల మధ్య కొట్లాటకు దారితీసింది. గవిరెడ్డి వర్సెస్ పీవీజీ అన్న చందంగా ఈ వివాదం మారింది. దేవరాపల్లి మండలం మారేపల్లిలో పాదయాత్ర ముగించుకొని తారువ వస్తుండగా టీడీపీ శ్రేణుల మధ్య ఈ చిచ్చు రేగింది. మారేపల్లిలోని స్థానిక మాజీ సర్పంచ్ ఇంటికి గవిరెడ్డి వెళ్లేందుకు ప్రయత్నించడమే ఈ వివాదానికి కారణం. గ్రామంలో పాదయాత్ర చేస్తుండగా స్థానిక మాజీ సర్పంచ్ ఇంటికి గవిరెడ్డి వర్గీయులు వెళ్లేందుకు ప్రయత్నించగా, పీవీజీ కుమార్ అక్కడికి వెళ్లకుండా తన వర్గీయులతో కలిసి సమావేశం జరిగే ప్రాంతానికి వచ్చేసి అసంతృప్తిని బాహాటంగా వెళ్లగక్కారు. దీంతో గవిరెడ్డి వారి ఇంటికి వెళ్లకుండానే వెనుదిరిగారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ ఇంటికి వెళితే బహిరంగంగా తమని అవమానించినట్లేనని బహిరంగ సమావేశంలో టీడీపీ మారేపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కిల్లి గోవింద పరోక్షంగా రామానాయుడిని నిలదీశారు. దీంతో గవిరెడ్డి వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విషయమై పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మారేపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు కిల్లి గోవింద మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. గవిరెడ్డి సమక్షంలోనే పరుష దూషణలతో అరుపులు, కేకలతో ఒకరిని మరొకరు తోసుకున్నారు. అక్కడే ఉన్న ఆ పార్టీ నాయకులు ఇద్దరినీ నిలువరించే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గలేదు. గవిరెడ్డి సైతం తన వర్గీయుడిగా ముద్రపడ్డ సూర్యనారాయణకే మద్దతు పలికి, పీవీజీ వర్గీయుడిగా ముద్ర వేసుకున్న గోవిందపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరు నేతల మధ్య లుకలుకలు మరోసారి బహిర్గతమయ్యాయి. హైకమాండ్ సూచనతో తామిద్దరం కలిసి నడుస్తున్నట్లుగా ఈ పాదయాత్రలో పైకి నటిస్తున్నప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటేనని తేలిపోయింది. అసలే పాదయాత్ర జనం లేక పేలవంగా సాగుతుండగా ఇలాంటి కుమ్ములాటలతో రచ్చకెక్కడంపై నేతలతో పాటు పార్టీ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నారు.

మిలాన్ ఏర్పాట్ల పరిశీలన

విశాఖ సిటీ: ప్రతిష్టాత్మక మిలాన్–2024 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసే పనిలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం జరగనుంది. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు పోలీస్, నేవీ, రెవెన్యూ, జీవీఎంసీ, ఇతర శాఖల ఉన్నతాధికారులు గురువారం మిలాన్ జరిగే ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రధాన స్టేజ్‌ప్లాన్ నుంచి బీచ్ రోడ్డులో భద్రత, వీక్షకుల గ్యాలరీ, బారికేడింగ్, ఇతర భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎన్.మణికంత చందోలు పాల్గొన్నారు.

వలంటీర్లకు సెల్యూట్

- సేవా పురస్కారాలతో సత్కరించిన కలెక్టర్
- మొత్తం 9,223 మందికి రూ.14.14 కోట్ల నగదు ప్రోత్సాహకాలు



పురస్కారాలు పొందిన వలంటీర్లతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా అధికారులు

తుమ్మపాల: వలంటీర్లు అందిస్తున్న సేవల మూలంగా లబ్ధిదారులందరూ సకాలంలో పథకాలను పొందగలుగుతున్నారని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ప్రశంసించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 9,223 మంది వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా కుల, మత, వర్గ, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటున్న వలంటీర్లను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి మాట్లాడుతూ.. వలంటీర్ల పనితీరు, కుటుంబాలు వ్యక్తం చేసిన సంతృప్తి, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వారి హాజరు శాతం, ప్రతి నెలా ఒకటో తేదీన శత శాతం పింఛన్ పంపిణీ, లబ్ధిదారుల గుర్తింపు వంటి అర్హతలను ప్రమాణాలుగా తీసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సేవా వజ్ర 33 మందికి రూ.45,000 చొప్పున రూ.14,85,000, సేవారత్న 135 మందికి రూ.30,000 చొప్పున రూ.40,50,000లు, సేవా మిత్ర 9,055 మందికి రూ.15,000 చొప్పున రూ.13,58,25,000లు మొత్తం 9,223 మందికి రూ.14 కోట్ల 13 లక్షల 60 వేలు చెక్కును అందజేస్తున్నామన్నారు. మరో 10 రోజుల్లో అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో వలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అంతకు ముందు గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా వలంటీర్ల సన్మాన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ శచీదేవి, డీఎల్‌డీవో అరుణశ్రీ, ఎంపీపీ జి.సూరిబాబు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా ఎన్నికల ఏర్పాట్లు

- ఈసీ నిబంధనలను పక్కాగా పాటించాలి
- నేడు సిబ్బందికి శిక్షణ తరగతులు
- జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: రానున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిపించేందుకు అధికారులందరూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. తన చాంబర్లో గురువారం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులు తమ బాధ్యతలను ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను తుచా తప్పకుండా ఆచరించాలన్నారు.

ముందుగా జిల్లాలోని అధికారులను వారు పనిచేసే శాఖ నిబద్ధతలను బట్టి టీంలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ ఈనెల 16వ తేదీన శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, అకౌంటింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వీడియో సర్వైలెన్స్, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్స్ వంటి విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎన్నికల విధులలో ఉన్న వారందరూ నిబంధనల మేరకు తప్పక నడుచుకోవలసి ఉంటుందన్నారు.

ఎటువంటి అనుమానాలకు ఆస్కారమీయకుండా పక్కాగా విధులు నిర్వహించవలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, మత్స్యశాఖ డీడీ ప్రసాద్, జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమారి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రామ్మూర్తి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ఎన్నికల శిక్షణ



ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు సెక్టార్ పోలీస్ అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో గురువారం సిబ్బందికి ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాను 158 సెక్టార్లుగా విభజించి పోలీస్ అధికారులను నియమించినట్టు చెప్పారు. శిక్షణలో భాగంగా ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుల్స్‌కు రాత పరీక్ష నిర్వహించారు. ఏఎస్పీ బి.విజయభాస్కర్, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి పాల్గొన్నారు.

నారాయణ కాలేజీ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

- కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్



నారాయణ కళాశాల వద్ద నిరసన తెలియజేస్తున్న వంశీ కుటుంబ సభ్యులు, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనకాపల్లి: అధ్యాపకుడు చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన నారాయణ కాలేజి విద్యార్థి పుచ్చకర్ల వంశీ కుటుంబానికి న్యాయం చేయాలని, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు డిమాండ్ చేశారు. బాధ్యుడైన అధ్యాపకుడిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. నారాయణ కళాశాల వద్ద వారు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు మామిడి రమణ, సిహెచ్.శివాజీలు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాలలో సీసీ కెమెరాలు ఉండాలని, మృతుడు వంశీ పరీక్షలు రాస్తున్న సమయంలో సీసీ ఫుటేజీని బహిర్గతం చేయాలని కోరినప్పటికీ కళాశాల యాజమాన్యం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కళాశాల యాజమాన్యం నాలుగు రోజులుగా కాలయాపన చేస్తోందని, కలెక్టర్, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్

అధ్యాపకుడు కొట్టడం వల్లే విద్యార్థి వంశీ మృతి చెందాడన్న వార్త సోషల్ మీడియాలో ప్రసారం కావడంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుందని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరితగతిన తక్షణ నివేదిక అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. తప్పు నిరూపణ అయితే కమిషన్ చైర్‌పర్సన్ కళాశాలపై చర్య తీసుకుంటారని చెప్పారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ



కార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థి ఎస్. కార్తీక్ జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటాడు. దేవరాపల్లికి చెందిన అతడు ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఓవరాల్‌గా 89.94 పర్సెంటైల్ స్కోర్ (మ్యాథ్స్–97.5156, ఫిజిక్స్–73.93305, కెమిస్ట్రీ–81.6489) సాధించాడు. ఈ మేరకు సదరు విద్యార్థిని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

పీహెచ్‌సీల్లో జిల్లా వైద్య బృందం తనిఖీలు



చింతపాక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైద్య బృంద సభ్యులు

బుచ్చెయ్యపేట: గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత, ఇతర ఆరోగ్య సేవలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ వైద్య బృందం తనిఖీలు నిర్వహించింది. మండలంలో చింతపాక, పెదపూడి గ్రామాల్లో గురువారం పర్యటించింది. ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు, బాలింతలకు, గర్భిణులకు రక్తహీనత పరీక్షలు చేస్తున్నారా? మందులు ఇస్తున్నారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకుంది. బృంద సభ్యులు జగదీష్, రామచంద్రరావు, నాగమణి తదితరులు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బంది సేవలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించింది. సీహెచ్ఎస్ సీతమ్మ, సూపర్‌వైజర్ సాంబశివ, ఏఎన్ఎం శివకుమారి పాల్గొన్నారు.

మరో అరసవల్లి రాజుపాలెం

- నేడు రథసప్తమి వేడుకలు
- స్వామివారి దర్శనానికి సర్వం సిద్ధం
- హాజరు కానున్న వేలాదిమంది భక్తులు



లక్ష్మీసమేత విష్ణుమూర్తి విగ్రహం

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో రెండో అరసవల్లిగా భాసిల్లుతున్న రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయం దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోంది. శుక్రవారం ఇక్కడ నిర్వహించే రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. వేకువజాము నుంచే వేలాది మంది భక్తులు దర్శనానికి వీలుగా దేవస్థానం కమిటీ చైర్మన్ కొణతాల బాబూరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలకు ఆలయ పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది.

ఆలయ చరిత్ర...


బ్రహ్మాద్రిపై వెలిసిన సూర్యనారాయణస్వామికి చారిత్రక నేపథ్యం ఉంది. రాజుపాలెం గ్రామానికి ఆనుకున్న బ్రహ్మాద్రిపై మూడు దశాబ్దాల క్రితం స్వామివారి శిలావిగ్రహం దొరికింది. పరిసర గ్రామాలకు చెందిన గొర్రెల కాపరి కొండపైకి వెళ్లినప్పుడు స్వామివారి విగ్రహం లభించడంతో ఆనాటి నుంచి రథోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఇక్కడ విశిష్టతను గుర్తించి గతంలో అనకాపల్లి ఎంపీపీగా పని చేసిన కొణతాల బాబూరావు చొరవ తీసుకొని రాజుపాలెం సూర్యనారాయణ మూర్తి దేవస్థానాన్ని నిర్మించి అదనపు హంగులు కల్పించారు. ఆలయ పరిసరాల్లో యాగశాల, ఆంజనేయస్వామి విగ్రహంతోపాటు భక్తులకు విశ్రాంతి మందిరం, ఆనంద నిలయాలు, మరుగుదొడ్లు నిర్మించారు. ఇటీవల కాలంలో రామానుజాచార్యులు ఆలయం, అక్షయ నిలయం, అఖండ దీప లక్ష్మి నిలయాలను నిర్మించారు.

ఏర్పాట్లు ఇలా...

స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తే అవకాశమున్నందున బారికేడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సేవాదళ్ బృందం ద్వారా తాగునీరు, మజ్జిగ, ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. ఉత్సవం రోజు పలు సాంస్కృతిక, బాణసంచా విన్యాసాలు భక్తులను ఆకట్టుకోనున్నాయి. డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐ జి.శంకరరావుల ఆధ్వర్యంలో 150 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఆలయానికి చేరుకునేదిలా..

ఆలయానికి మూడు దారుల్లో చేరుకోవచ్చు. విశాఖ నుంచి వచ్చేవారు తాడి గ్రామం మీదుగా రావచ్చు. మునగపాక పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సిరసపల్లి రామానాయుడుపేట వల్లూరు మీదుగా తారురోడ్డును ఎంచుకోవాలి. అనకాపల్లి నుంచి వచ్చేవారు.. కేఎస్ఆర్‌పేట మీదుగా ఆలయానికి చేరుకోవాలి. ఈ రహదారిని రూ.1.40 కోట్ల ప్రభుత్వ నిధులతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అభివృద్ధి చేశారు.



ఆలయ ఆవరణలో ఆంజనేయస్వామి విగ్రహం



సూర్యనారాయణస్వామి

సూర్యనారాయణ స్వామికి బంగారు నేత్రాలు వితరణ



సూర్యనారాయణ స్వామికి భక్తుడు సమర్పించిన బంగారు నేత్రాలు



వెండి కిరీటాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న కరణం కేశవరావు కుటుంబ సభ్యులు

జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి దేవాలయానికి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తులం పావు బంగారంతో తయారు చేసిన సువర్ణ నేత్రాలు, రత్నాల పొదిగిన తిరునామం సమర్పించారు. వీటిని ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ నేత్రాలు విలువ రూ. 90వేలు ఉంటుందన్నారు. మరో భక్తుడు కరణం కేశవరావు కుటుంబ సభ్యులు రూ.50 వేలు విలువచేసే 600 గ్రాముల వెండి కిరీటాన్ని అందజేశారు. అంతకుముందు రాజుపాలెం గ్రామం నుంచి కేశవరావు కుటుంబ సభ్యులు వెండి కిరీటాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు దొడ్డిపట్ల కల్యాణ్ కుమార్, వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో సత్ఫలితాలు



ప్రాజెక్టు రూపకర్త అనితను అభినందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

తుమ్మపాల: వైజ్ఞానిక ప్రదర్శనలతో పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న జ్ఞానాన్ని వెలికితీయొచ్చని డీఈవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. పట్టణంలో ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను జాతీయ స్థాయి పరిశీలకుడు డాక్టర్ మోహిత్ రషీద్ షేక్‌తో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 123 ప్రాజెక్టులు, ఏఎస్ఆర్ జిల్లా నుంచి 5 ప్రాజెక్టులతో విద్యార్థులు ప్రదర్శనకు హాజరయ్యారన్నారు. ఎంపికైన నమూనాలు చిత్తూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. జిల్లా సైన్స్ అధికారి కాళిదాసు, అల్లూరి జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు, పాఠశాల విద్యాశాఖ ఐడీ ఏడీ రవిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కశింకోట: కశింకోట బాలికల హైస్కూల్లో టెన్త్ చదువుతున్న బట్నాయని అనిత రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైంది. అనకాపల్లిలో గురువారం జరిగిన ఇన్‌స్పైర్ మనక్‌లో ×దాహంతో ఉన్న రోడ్లు₹ ప్రాజెక్టును గైడ్ టీచర్ కల్పన ప్రోత్సాహంతో ఆమె ప్రదర్శించింది. జ్ఞాపికను అందజేసి డీఈవో అభినందించారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

- స్త్రీ శిశు సంక్షేమ అధికారి అనంతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

తుమ్మపాల: బాల్య వివాహాల నిరోధానికి క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు సీఎంపీవోలు బాల్య వివాహ నిరోధక అధికారులకు తెలియజేయడం ద్వారా అవసరమైన చర్యలు చేపడుతున్నామని స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి అన్నారు. పట్టణంలో మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, డాక్టర్ పావని, డీపీఎం ఎం.శరత్‌బాబులతో కలిసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల విషయంలో సీడబ్ల్యూసీ ఎప్పుడూ తగు జాగ్రత్తలతో వారిని ఏదైనా రక్షణ గృహాలకు పంపడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. బాలల న్యాయ రక్షణ సంరక్షణ చట్టం గురించి, బాలల హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా, తక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించిన వారిపైనా కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. హాస్టల్ పిల్లలకు రక్తహీనత లేకుండా లోపాలను గుర్తించి, వారికి పోషక విలువలతో కూడిన సమతుల్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం ఇచ్చినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. బాలల రక్షణపై సహాయం కోసం 9966141470కు సంప్రదించాలని బాలల పరిరక్షణ విభాగం అధికారి పి.లక్ష్మి తెలిపారు.

డీఎస్పీ వెంకటరామయ్య బాధ్యతల స్వీకారం



ఎస్పీ మురళీకృష్ణకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

నర్సీపట్నం: నర్సీపట్నం కొత్త డీఎస్పీ బి.వెంకటరామయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ డీఎస్పీగా పని చేస్తూ ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఎస్పీ వెంకటరామయ్య అనకాపల్లిలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు.

ప్లాస్టిక్ పైపుల్లో మొక్కల పెంపకం



ప్లాస్టిక్ పైప్‌ల్లో మొక్కలను పెంచే విధానం అద్భుతం..



బయోగ్యాస్ పరికరం తయారు చేసిన విద్యార్థులు

- ఆర్ఏఆర్ఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రయోగం ఆవిష్కరణ

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ పాలిటెక్నికల్ తృతీయ సంవత్సరం విద్యార్థులు మొక్కల పెంపకంలో సరికొత్త ప్రయోగాన్ని ఆవిష్కరణ చేశారు. మట్టిలో మొక్కలు పెరిగే దాని కంటే ప్లాస్టిక్ పైపుల్లో పెంచే పద్ధతిని కనుగొన్నారు. నీటిలో పూర్తిగా ప్లాస్టిక్ పైపుల్లో నిలువుగాను, అడ్డంగా పెరిగే విధంగా కొత్త ప్రయోగాన్ని చేశారని ఈ సందర్భంగా పరిశోధనా స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. అడ్డంగా ప్లాస్టిక్ పైపుల్లో పెంచడం వల్ల స్థలం ఎక్కువగా ఉండాలని, నిలువుగా అయితే తక్కువ స్థలం సరిపోతుందన్నారు. వీటికి జల, ద్రవ రూపంలో ఎరువులు, పశుగ్రాసం వేయాలన్నారు. తక్కువ ఖర్చుతో ప్రస్తుతం బంతి మొక్కలను పెంచుతున్నామన్నారు.

చెత్త, కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్...

మరో తృతీయ సంవత్సరం విద్యార్థులు ఇంట్లో చెత్త, కూరగాయల వ్యర్థాలతో బయోగ్యాస్ ప్రక్రియను తయారు చేసినట్టు ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. ప్రాజెక్టు విద్యార్థులు కె.జ్ఞానేశ్వరి, కె.కీర్తి, ఎం.హర్షిత, పి.మోసస్, రమ్యశ్రీ, ఎం.శ్రీరామ్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గోపాలరావు పాల్గొన్నారు.

62 కిలోల గంజాయితో బాలుడి అరెస్టు

- ఆటోలో ఇద్దరు పరారీ
- రెండు మొబైల్స్, ద్విచక్ర వాహనం స్వాధీనం



పోలీస్‌లు స్వాధీనం చేసుకున్న గంజాయి

రోలుగుంట: మండలంలో ఎం.కె.పట్నం శివారు గ్రామం కొరుప్రోలులో 62 కిలోల గంజాయిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో కొత్తకోట సీఐ ఎల్. అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై ఎల్. సురేష్, సిబ్బందితో కలసి ఇక్కడ దాడి చేశారు. ఆ సమయంలో ఆటోలో గంజాయి లోడు చేస్తుండగా బాలుడు(16) పట్టుబడ్డాడు. మరో ఇద్దరు ఆటోలో పరారయ్యారు. ద్విచక్రవాహనం, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రూ.3.10 లక్షలు ఉంటుందని అంచనా. పట్టుబడిన వ్యక్తి జి.మాడుగుల మండలం గెమ్మిలి పంచాయతీ వరిసేలపాలెం గ్రామానికి చెందిన బాలుడిగా గుర్తించారు. కేసు నమోదు చేసి జువెనైల్ హోమ్‌కు తరలించామని సీఐ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నామన్నారు.

అంకితభావంతో పనిచేసే డ్రైవర్లకు మన్ననలు

- ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి పద్మావతి, డీటీసీ ఇన్‌చార్జి ప్రకాష్



ఉత్తమ డ్రైవర్‌ను సత్కరిస్తున్న పద్మావతి, ప్రకాష్

అనకాపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రయాణికుల మన్ననలను పొందాలని ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి కె.పద్మావతి, డీటీసీ ఇన్‌చార్జి కె.వి.ప్రకాష్ తెలిపారు. గురువారం స్థానిక డిపో ఆవరణలో రోడ్డు (ఆర్టీసీ) భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఆర్టీసీ బసుల్లో ప్రయాణికులను వారి గమ్యస్థానానికి భద్రంగా చేర్చే బాధ్యత గుర్తెరగాలన్నారు. డీటీసీ ఇన్‌చార్జి ప్రకాష్ మాట్లాడుతూ మానవుని తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ పైడపునాయుడు మాట్లాడుతూ రహదారులపై వాహనాలు ఆపడం వల్ల వెనుక వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అనంతరం జిల్లాలోనే అత్యధిక రోజులు ప్రమాద రహితంగా విధులను నిర్వహించిన తొమ్మిది మంది డ్రైవర్లను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డీఎం ధీరజ్‌కుమార్, ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆన్‌లైన్ గేమ్‌తో ఆర్థిక ఇబ్బందులు
- లేఖ రాసి ఉరేసుకున్న వైనం
- ఆర్.శివరాంపురంలో ఘటన



మృతుడు కోటేశ్వరరావు (ఫైల్)

బుచ్చెయ్యపేట: ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకుని మానసికంగా కుంగుబాటుకు గురైన యువకుడికి కుటుంబ తగాదాలు తోడవడంతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుచ్చెయ్యపేట మండలం ఆర్. శివరాంపురంలో గురువారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చందక దేముడు మనవడు కోటేశ్వరరావు(22) పిన్ని లత ఇటీవల మృతి చెందింది. ఈమె మృతికి కారకులుగా కోటేశ్వరరావు, అతని తల్లిదండ్రులు శ్రీను, అప్పయమ్మ, చెల్లి, నానమ్మపైన మేనత్త కేసు పెట్టింది. ఇదే క్రమంలో కొన్నాళ్లుగా ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సదరు యువకుడు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో 10 శాతం మాత్రమే ఆర్థిక లావాదేవీలు కాగా, 90 శాతం ఇటీవల తన మేనత్త, మరికొంత మంది మా కుటుంబ సభ్యులపై కేసు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పించడంపై అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. బుధవారం రాత్రి తన పొలంలోకి వెళ్లి పాకలో ఉరేసుకుని మృతి చెందాడు. గ్రామంలో పలుకుబడి ఉండి ఆర్థిక ఇబ్బందులు లేని కోటేశ్వరరావు ఆత్మహత్య చేసుకోవడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

శోక సంద్రంలో కుటుంబం..

పెళ్లీడికి వచ్చిన ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడవుతాడనుకుంటే ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంపై కోటేశ్వరరావు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అతడి మృతిపై తండ్రి శ్రీను బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ డి. ఈశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

'ఇకపై ఎవరూ ఆన్‌లైన్ గేములాడి కుటుంబ సభ్యులకు భారం కావద్దు. ఎవరి మీదైనా ఆరోపణలు చేసే ముందు ఆలోచించండి. వారు మానసికంగా కుంగిపోతే చాలా అనర్థాలకు దారి తీస్తుంది. నా చావును నేనే డిసైడ్ చేసుకున్నాను' అని యువకుడు చందక కోటేశ్వరరావు సూసైడ్ నోట్‌లో రాసి ఆత్మహత్య చేసుకున్నాడు.



సూసైడ్ నోట్ పేజీలు

క్లుప్తంగా

జోన్ పరిధిలో జగనన్న గృహాల రిజిస్ట్రేషన్లు



సచివాలయంలో జగనన్న గృహాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పరిశీలిస్తున్న జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు

అనకాపల్లి: అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా జగనన్న గృహాలను అందజేసిందని, లబ్ధిదారుల వారివారి గృహాలను సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. జోన్ పరిధిలో 16, 18 సచివాలయాల్లో ఆన్‌లైన్ లబ్ధిదారుల వివరాలను గురువారం ఆయన పరిశీలించారు. జోన్ పరిధిలో 5500 మందికి మండలంలో వివిధ ప్రాంతాల్లో సెంట్ ప్రభుత్వ స్థలంలో జగనన్న గృహాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని, లబ్ధిదారులకు పూర్తి హక్కు ఉండేందుకు 27 సచివాలయాల్లో ఐదు రోజుల పాటు రిజిస్ట్రేషన్ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వి.కె.దొర, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

కశింకోట: కశింకోట వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.30 కాగా, ఈ వారం రూ.10 తగ్గి రూ.20కి అమ్మకాలు సాగాయి. ఉల్లిపాయ రూ.20, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్ దొండకాయ రూ.60, బెండకాయ, క్యాప్సికం, బీన్స్ రూ.80, చిక్కుడు రూ.80కి అమ్మకాలు సాగాయి.

20న మండల ప్రజా పరిషత్ సమావేశం

అనకాపల్లి : మండల ప్రజా పరిషత్ 11వ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 20న స్థానిక ఎంపీడీవో కార్యాలయం మేడపైన ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పి.వి.వి.ఎం.మోహన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరిషత్ సమావేశం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరుగుతుందని, మండలంలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 6,531 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,760
మొదటి రకం	3,590	4,160
రెండో రకం	3,470	3,680
మూడోరకం	3,200	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
ఓయ్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 116 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-40 యూనిట్లు, బీ పాజిటివ్-46 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

చింతలు తీరిన పాలెం...



- చింతలపాలెం సచివాలయం పరిధిలో అభివృద్ధి కాంతులు
- రూ.కోటి 40 లక్షలతో అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పనతో మారిన గ్రామం రూపురేఖలు



చింతలపాలెం గ్రామ ఎన్టీఆర్ కాలనీలో కోన రత్నం 30 ఏళ్లగా నివాసం ఉంటోంది. భర్త అప్పలసోమినాయుడు వ్యవసాయ కూలీ. కుమారుడు మోహన్, పెళ్లైన కుమార్తె ఉన్నారు. తాగునీటి కోసం నిత్యం ఇబ్బంది పడేవారు. దూరంగా ఉన్న చేతి బోరు నుంచి నీరు సేకరించి తెచ్చుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాది క్రితం జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ఎక్కడికీ వెళ్లే శ్రమ లేకుండా ఇంటి వద్దే మంచినీటిని పట్టుకొని తాగుతున్నారు. ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయడం పట్ల రత్నం ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చింతలపాలెం గ్రామానికి చెందిన బుదిరెడ్డి నాగమణికి సొంత ఇల్లు, స్థలం లేదు. భర్త నారాయణమూర్తి వ్యవసాయ కూలీ. ఇద్దరు కుమార్తెలు. వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌లో సెంటున్నర ఇంటి స్థలం ఇచ్చారు. దీనికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సచివాలయం ఏర్పాటు ద్వారా ఉచితంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అందుబాటులో ప్రభుత్వ సేవలందిస్తున్నారని, ఎంతో ఆనందంగా ఉందని చెబుతూ ఆమె ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కశింకోట : మండలంలోని చింతలపాలెం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోటి 40 లక్షలు పైబడి ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. సచివాలయ భవనం, సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. చింతలపాలెం సచివాలయం పరిధిలో చింతలపాలెంతో పాటు గొబ్బూరు పంచాయతీ ఉన్నాయి. సుమారు 3 వేల జనాభా కలిగి ఉంది. ఇక్కడి సచివాలయాన్ని తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్నారు. కొత్తగా దీనికి రూ.35 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నాడు-నేడులో రూ.18 లక్షలు వెచ్చించి అందంగా రంగులు వేసి మరమ్మతులు చేపట్టి తీర్చిదిద్దారు.

రెండు మరుగుదొడ్లు కూడా నిర్మించారు. తరగతి గదుల చుట్టూ జంతువులు, దేశ నాయకులు, పండ్లు వగైరా బొమ్మలు వేశారు. అక్షరాలను కూడా పిల్లలు ఎప్పుడైనా చదువుకునే విధంగా పెద్ద అక్షరాలతో అందంగా తరగతి గోడలపై రంగులతో రాశారు. పిల్లలు ఆడుకోవడానికి అనువుగా ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. ఇవి విద్యార్థులను అలరిస్తున్నాయి.



ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తీరిన తాగునీటి చింత

వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో చింతలపాలెం పంచాయతీ పరిధిలో ఏడాది క్రితం జల్‌జీవన్ మిషన్ కింద రూ.38 లక్షలు వెచ్చించి సుమారు 550 మందికి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి తాగునీటిని అందిస్తున్నారు. శ్మశానానికి రూ.10 లక్షలు వెచ్చించి జాతీయ ఉపాధి పథకం నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇక రైతు భరోసా కేంద్ర భవనం మంజూరైనప్పటికి దాన్ని నిర్మించాల్సి ఉంది. చింతలపాలెంలో 144 మందికి వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌లో సెంటున్నర వంతున ఒక్కొక్కరికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వాటికి ఉచితంగా రిజిస్ట్రేషన్లు తాజాగా నిర్వహిస్తున్నారు.



చింతలపాలెంలో ప్రారంభానికి సిద్ధమైన సచివాలయ భవనం



ప్రాథమిక పాఠశాలలో ఆట వస్తువులపై ఆటలాడుకుంటున్న విద్యార్థులు

అభివృద్ధి నిధుల వెచ్చింపు ఇలా..

సచివాలయ భవనం	: రూ.35 లక్షలు
నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి	: రూ.18 లక్షలు
సిమెంట్ రోడ్ల నిర్మాణం	: రూ.49 లక్షలు
గ్రామంలో 550 మందికి ఇంటింటి కుళాయి కనెక్షన్లు	: రూ.38 లక్షలు

ఇప్పటికే దాదాపు 50 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడ పంపిణీ చేసిన ఇంటి స్థలానికి మార్కెట్ ధర ప్రకారం 2.17 లక్షల ధర ఉంది. రూ.4438 ఖర్చు అయ్యే రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

గొబ్బూరు పంచాయతీలో..

సచివాలయ పరిధిలోని గొబ్బూరు పంచాయతీలో కూడా గతంలో ఎన్నడూలేని విధంగా రూ.39 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించి అభివృద్ధి చేశారు. గ్రామంతో పాటు కాలనీలో కూడా రోడ్లు నిర్మించారు. పంచాయతీ, జాతీయ ఉపాధి హామీ పథకం, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు ఇందుకు ఖర్చు చేశారు. వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ కాలనీలో 80 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చారు. వాటిలో సగం మేర పూర్తి అయ్యాయి. వీటిలో 60 మంది ఇళ్ల స్థలాలను ఇప్పటికే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరగడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గొబ్బూరులో నిర్మించిన సిమెంట్ రోడ్డు

జగనన్న పాలనలో చక్కని చదువులు



చింతలపాలెం ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నాడు-నేడులో అందంగా అభివృద్ధి చేశారు. పాఠశాలలోనే నా కుమారుడు ప్రేమ్ సాగర్ 3వ తరగతి చదువుతుండగా, పెద్ద కుమారుడు శ్యాం సాయి 5వ తరగతి వరకు చదివారు. నాడు-నేడులో అందంగా రంగులు వేసి పార్కు నిర్మించి ఆటలు ఆడుకోవడానికి సామగ్రిని ఏర్పాటు చేశారు. రెండు మరుగుదొడ్లను కూడా నిర్మించి అందంగా తీర్చిదిద్దారు. బోధన కూడా బాగుంది. దీంతో మా కుమారులను ఇక్కడే చదివించాను. తుప్పలతో నిండి అధ్వానంగా ఉన్న పాఠశాలను ఎంతో అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

-మైలపల్లి ప్రవంతి, ఎస్సీ కాలనీ, చింతలపాలెం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

కశింకోట : ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా భావి తరాలకు ఆరోగ్యాన్ని అందివ్వాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న అన్నారు. మండలంలోని విసన్నపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సేంద్రియ పద్ధతులు పాటించి పంటలను సాగు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి దోహదపడాలన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల సాగుకు ఐదు అంచెల పద్ధతి అనుసరించాలన్నారు. పంటల అధిక దిగుబడులు పొందడానికి, తెగుళ్ల నివారణకు ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన కాషాయాలు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, మిశ్రమ పంటల సాగు వల్ల ఉపయోగాలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ట్యాంకు గురించి, ఔషధ మొక్కల పెంపకం, కలుపు నివారణ పద్ధతులు, విత్తన శుద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ సిబ్బంది చిన్న, యూనిట్ ఇన్‌ఛార్జి కూండ్రపు అరుణ పాల్గొన్నారు.



విసన్నపేటలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కశింకోట : కశింకోటలోని 4వ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జరగనుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో జరిగే శిబిరానికి ప్రత్యేక వైద్యులు హాజరై ఉచితంగా పరీక్షించి మందులు అందజేస్తారన్నారు. కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి సిఫారసు చేస్తారన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రేపు శాంతిపార్కుకు ప్రారంభోత్సవం



శాంతిపార్కుల్లో పలు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మందపాటి జానకీరామరాజు



పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు

- రూ. 59 లక్షలతో అభివృద్ధి

అనకాపల్లి : స్థానిక శారదానది ఒడ్డున శాంతి పార్కును రూ.59 లక్షల నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని, ఈనెల 17న రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. శారదానది ఒడ్డున శాంతిపార్కులో పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ పార్కును జీవీఎంసీ నిధులు రూ. 49 లక్షలు, ఎంపీ నిధులు రూ.10లక్షలతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పార్కులను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. వేసవిలో వృద్ధులు, పిల్లలు ఆటలు అడుకునేందుకు వివిధ రకాలైన ఆటవస్తువులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లి : ఏపీ ఎన్‌జీవోఎస్ జెఏసీ ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ) డిపో గేటు వద్ద గురువారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ పీటీడీ నేషన్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రిజనల్ కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, ఈహెచ్ఎస్ బిల్లులు చెల్లించాలని, డీఏ ఏరియర్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేయాలని తదితర డిమాండ్లతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డిపో అధ్యక్షుడు ఎఎస్.రావు, ఉద్యోగులు ఎండీ.రాజు, కె.ఎస్.గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు 'సేవా' పురస్కారాలు

- ఆరుగురికి సేవా వజ్ర
- ఏడుగురికి సేవా రత్న
- 840మందికి సేవా మిత్ర





సేవా వజ్ర పురస్కార గ్రహీతలు దుంగ శ్రీవిద్య, కన్నూరు యమున

అనకాపల్లి : అనకాపల్లి పట్టణ, మండలంలో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించిన వలంటీర్లకు వజ్ర, రత్న, మిత్ర అవార్డులతో సత్కరించినట్టు జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఎంపీడీవో పి.వి.వి.ఎం. మోహన్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సేవావజ్ర అవార్డులు ఆరుగురికి, సేవా రత్న అవార్డులు ఏడుగురికి, సేవా మిత్ర అవార్డులు 840మందికి ఇవ్వడం జరిగిందన్నారు. సేవా వజ్ర రూ.45వేలు, సేవా రత్న రూ. 30వేలు, సేవా మిత్ర రూ.15వేలు అందజేస్తున్నట్లు వారు చెప్పారు.

కశింకోట : మండలంలో ఉత్తమ సేవలందిస్తున్న ఇద్దరు గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న పురస్కారాలు లభించాయి. కొత్తపల్లి సచివాలయానికి చెందిన దుంగ శ్రీవిద్య, ఈ.చౌడువాడకు చెందిన కన్నూరు యమునలకు సేవా వజ్ర పురస్కారాలు లభించాయి. కశింకోట సచివాలయం-3కి చెందిన సూరిశెట్టి కిషోర్, మండ సాయి భాస్కరరావు(కశింకోట-1), కాళ్ల ధర్మతేజ(జి. భీమవరం), నక్కా పార్వతి(వెదురుపర్తి), కుంచంగి అప్పలస్వామినాయుడు(చింతలపాలెం) సేవా రత్నా పురస్కారాలు లభించాయి. ఈ మేరకు సేవ వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నా పురస్కార గ్రహీతలకు రూ.30 వేలు వంతున నగదు బదిలీతో పాటు సేవా పతకం, ప్రశంసాపత్రం లభించాయి. వీటిని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌ల చేతుల మీదుగా అనకాపల్లిలో అందజేశారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

మునగపాక: వాహనాలు నడిపేటపుడు హెల్మెట్‌లు ధరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాకలోని ప్రణతి పబ్లిక్ స్కూల్‌లో గురువారం 8 సంవత్సరాల లోపు పిల్లలకు ఆయన హెల్మెట్‌లు అందజేశారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ హెడ్ ఇంజ్యూరీ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను పాటించాలన్నారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ, అనకాపల్లి అర్బన్ ప్రాంతాల్లో 15000 మంది పిల్లలకు రహదారి భద్రతపై అవగాహన కలిస్తూ 5వేల హెల్మెట్‌లు అందజేయాలని నిర్ణయించామన్నారు. డాక్టర్ రవి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు హెల్మెట్‌లు దోహదపడతాయన్నారు. ప్రణతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



హెల్మెట్లు అందజేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

కుష్ఠు వ్యాధి నివారణపై చైతన్యం

కశింకోట: కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్ఠు వ్యాధిపై పక్షం రోజులపాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ముగిసిందని వైద్యాధికారులు ఎస్. తిరుపతిరావు, వై.యశోద గురువారం తెలిపారు. 23 గ్రామాలు, 35 పాఠశాలల్లో తమ సిబ్బందితో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కుష్ఠు చికిత్స విధానాల గురించి వివరించి చైతన్య పరిచామన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల కమిటీల నియామకం

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి నియోజకవర్గం నుంచి 17 జిల్లా విభాగాల కమిటీలను నియమించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా బీసీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బుద్ధా శ్రీను, సెక్రెటరీలుగా చిన్ని జనార్దన్, చెల్లిబోయిన మురళి, పాలమరశెట్టి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీలుగా దొడ్డి హరిబాబు, నమ్మి గోవింద్‌లనుక్రిష్టియన్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రెటరీగా వరాహా వెంకట గణేశ్వర రావు, సెక్రెటరీలుగా జైపాల్ బాబులు పోగుల, బి.ఏసు రత్నం, జాయింట్ సెక్రెటరీగా డేవిడ్ ప్రభాకర్ నెలపూడిలను నియమించారు. జిల్లా కల్చరల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా కర్రి రుద్రినాయుడు, జనరల్ సెక్రెటరీగా వి.ఎస్. హనుమంతురావు, సెక్రెటరీలుగా కొప్పోజూ బాల పార్వతి, బొండా శంకర్‌రావు, కేతిరెడ్డి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీలుగా ఐ.వి కూర్మనాథ్, జిల్లా ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీగా కనహాల శ్యాంకుమార్, జాయింట్ సెక్రటరీగా ముత్తా వెంకటేష్, జిల్లా మహిళా విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పెంటకోట జ్యోతి, జనరల్ సెక్రటరీగా ఎ.వి.రత్నకుమారి, ముర్రిపల్లి శోభ, ఎస్.ఎస్.లక్ష్మి, సెక్రటరీలుగా కొట్నాల పద్మకుమారి, జాయింట్ సెక్రటరీలుగా దొడ్డి లక్ష్మి, జిల్లా మైనారిటీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎస్.జిలానీ, జనరల్ సెక్రటరీగా పి.ఎస్.ఎన్ హుస్సేన్, సెక్రటరీలుగా రెహ్మతుల్లా, సలీంబాయ్, ఉమర్ అలీ నియమితులయ్యారు.

జిల్లా పంచాయతీరాజ్ విభాగ కమిటీ ప్రెసిడెంట్‌గా గొర్లి సూరిబాబు, జనరల్ సెక్రటరీగా యల్లపు వెంకట రమేష్, సెక్రటరీలు పంచదార్ల కన్నరావు, ఉప్పులూరు అప్పారావు, జాయింట్ సెక్రటరీలు బొండా అప్పలరాజు, ఎం.రమణ, జిల్లా రైతు విభాగ కమిటీ జనరల్ సెక్రటరీలుగా పీలా బుజ్జి, కోరుకొండ మునిస్వామి, సెక్రటరీలుగా సేనాపతి పెంటారావు, గోకివాడ గోవింద్, జాయింట్ సెక్రటరీలుగా కొల్లి నాయుడుబాబు, సామిరెడ్డి ముత్యాలనాయుడు, జిల్లా ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీగా దండా వెంకట నరసింహరావు, సెక్రటరీలుగా కొత్తపల్లి శ్రీనువాస్, రేబాక స్వామి, జాయింట్ సెక్రటరీలుగా నిమ్మకాయల మాధవిరావు, కఠారి మహేశ్వరరావు, జిల్లా ఎస్టీ విభాగం సెక్రటరీగా పందడి పద్మ, జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీ గొర్రి సింహాద్రి, సెక్రటరీగా పెంటకోట రూప్‌తేజ, జిల్లా వాణిజ్య విభాగం ప్రెసిడెంట్‌గా కడిమిశెట్టి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీధరాల మనోజ్, జనరల్ సెక్రటరీలుగా పట్నాల రఘు, ఎ.కృష్ణాజీ, సెక్రటరీలుగా కర్రి భాస్కర్‌రావు, గుండా రమేష్ గుప్త, కొట్టోజ్ నూక నాగ రత్నం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొణతాల కృష్ణంరాజు, విజ్జపు వాసు, వి.హర్షిక్, పప్పర్తి వెంకటరాజు, గంగుబోయిన గౌతమ్‌లను నియమించారు.

జిల్లా చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా ఆకుల నూక సంతోష్‌కుమార్, సెక్రటరీలుగా పిచుక ఈశ్వరరావు, జిల్లా సేవాదళ్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఏరుబండి సత్యనారాయణ రావు, సెక్రటరీగా వడ్డి చినబాబు, జాయింట్ సెక్రటరీలుగా చిన్ని రాజీవ్, కాండ్రేగుల భాస్కర్‌రావు, బొడ్డపు ప్రసాద్, జిల్లా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆడారి సూరిబాబు, జనరల్ సెక్రటరీగా దాడి బోగిలింగేశ్వరావు, సెక్రటరీలుగా అరిగా అప్పారావు, జనపరెడ్డి మధుసూధన్ రావులను నియమించారు.